తండ్రి జ్ఞాపకార్థం విగ్రహం

- ఏర్పాటు చేసిన కొడుకులు
- ఆవిష్కరించిన ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్


విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న ఎంపీ కవిత

ఇనుగుర్తి, ఫిబ్రవరి28: మండలంలోని శీన్యాతండాలో ఓతండ్రికి కొడుకులు విగ్రహం కట్టించారు. శీన్యానాయక్ విగ్రహాన్ని కుమారులు జాటోత్ దేశ్య, రావోజీ, రాంజీ, హరిచంద్ ఏర్పాటు చేయగా, ఎంపీ మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, గాయత్రి గ్రూప్ అధినేత వద్దిరాజు కిషన్ బుధవారం ఆవిష్కరించారు. అనంతరం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కంటికి రెప్పలా పెంచి పెద్దచేసి ప్రయోజకులను చేసిన తల్లిదండ్రుల కన్నా ఎవరూ ఎక్కువ కాదన్నారు. తండ్రి విగ్రహం ఏర్పాటు చేసిన నలుగురు కుమారులను వారు అభినందించారు. కార్యక్రమంలో జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్లు దీకొండ వెంకన్న, గుండా వెంకన్న, బీఆర్ఎస్ మండల శాఖ అధ్యక్షుడు నజీర్‌అహ్మద్, సీనియర్ నాయకులు మర్రి రంగారావు, నీలం దుర్గేశ్, మాజీ సర్పంచ్‌లు దార్ల రామ్మూర్తి, మామిడి శోభన్, చీకటి ప్రవీణ్, బానోత్ రామన్ననాయక్, నాయకులు బేతమల్ల చంద్రయ్య, గండు నాగన్న, శ్రీకాంత్ పాల్గొన్నారు.

వధూవరులకు ఆశీర్వాదం

నర్సింహులపేట: మండలంలోని కొమ్ముల వంచ మాజీ సర్పంచ్ దాసరోజు వెంకటేశ్వర్లు కుమారుడు భానుప్రసాద్– వైష్ణవి వివాహం బుధవారం జరిగింది. మహబూబాబాద్ ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, మాజీ ఎమ్మెల్యే ధరంసోత్ రెడ్యానాయక్, పార్టీ రాష్ట్ర నాయకుడు నూకల నరేశ్‌రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట వైస్ ఎంపీపీ దేవేందర్, మైదం దేవేందర్, గుగులోత్ రవి, రామన్న, వెంకటేశ్వర్లు, వంశీ, లక్ష్మణ్ తదితరులు ఉన్నారు.

రైల్వే సమస్యలపై ఎంపీకి వినతి

గార్ల: మండలంలోని రైల్వే స్టేషన్ సమస్యలపై సీతంపేట గ్రామస్తులు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఎంపీ మాలోత్ కవితకు వినతి పత్రం అందజేశారు. రైల్వే ఉన్నతాధికారులతో చర్చించి శాతవాహన, ఇంటర్ సిటీ ట్రైన్‌లను నిలుపుదల చేసేలా చూస్తానని, స్థానిక సమస్యలను సైతం పరిష్కరిస్తానని ఎంపీ హామీనిచ్చారు.

ప్రిన్సీ వైద్య ఖర్చులకు ఆర్థిక సాయం

కేసముద్రం: మండలంలోని అర్పనపల్లి గ్రామానికి చెందిన బత్తుల నరేశ్ కుమార్తె ప్రిన్సీ వైద్య ఖర్చుల కోసం ఎంపీ, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత రూ.20 వేల ఆర్థికసాయం అందించారు. ప్రిన్సీ ప్రాణాపాయ స్థితిలో ఉండి హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతోంది. ఈ మేరకు బుధవారం ఐసీయూలో చికిత్స పొందుతున్న ప్రిన్సీని ఎంపీ కవిత పరిశీలించి, ఆమె తల్లిదండ్రులకు మనోధైర్యం కల్పించారు. వైద్యులతో మాట్లాడి ఆమె ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాలని డాక్టర్లకు సూచించారు.

తెలంగాణ ఉద్యమకారుడు ఉపేందర్ మృతి

ఉపేందర్(ఫైల్)

బయ్యారం, ఫిబ్రవరి 28: తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్ఎస్ క్రీయాశీల కార్యకర్త తంగెళ్లపల్లి ఉపేందర్ బుధవారం అనారోగ్యంతో మృతి చెందాడు. మండల కేంద్రంలోని కాకతీయ నగర్‌కు చెందిన ఉపేందర్ తెలంగాణ ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించగా, ఆయనపై పలు కేసులు నమోదయ్యాయి. గతంలో బీఆర్ఎస్ ప్రచార కార్యదర్శిగా పార్టీకి సేవలు అందించారు. కొన్ని రోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బీఆర్ఎస్ నాయకులు ఎనుగుల ఐలయ్య, ఉద్యమకారుడు బుచ్చిరెడ్డి నివాళులర్పించారు. ఉపేందర్ మృతికి మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్, ఎంపీ మాలోత్ కవిత సంతాపం తెలిపారు.

ఘనంగా టైలర్స్ డే

కేసముద్రం, ఫిబ్రవరి28: కుట్టు మిషన్ రూపకర్త విలియమ్స్ హో జయంతి సందర్భంగా టైలర్స్ డే వేడుకలను బుధవారం మండల మేర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా జెండాను ఆవిష్కరించారు. అనంతరం దర్జీలు మాట్లాడుతూ రెడీమెడ్ దుస్తులు అందుబాటులోకి రావడంతో కుట్టు మిషన్ మీద ఆధారపడే వారి జీవన విధానం ఇబ్బందిగా మారిందన్నారు. మేర కుల స్తులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, షాపులకు ఉచిత విద్యుత్ సరఫరా అందించాలని కోరారు. కార్యక్రమంలో సోమ విజయ్‌కుమార్, రాయబారపు సురేందర్, గట్ల భిక్షపతి, కీర్తి వీరస్వామి, కొత్త కొండ యాదగిరి, రామగిరి శ్రీనివాస్, హరికృష్ణ, అడప రాజు, సమ్మయ్య, సుసుమ సాంబమూర్తి, పాషా, రఫీ తదితరులు ఉన్నారు.

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

- కేంద్రాలను తనిఖీ చేసిన అదనపు కలెక్టర్
- మొదటి రోజు 4,935 మందికి 4,573 మంది విద్యార్థుల హాజరు

జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలకు పరీక్ష రాసేందుకు వచ్చిన విద్యార్థులు

మహబూబాబాద్ రూరల్, ఫిబ్రవరి 28 : జిల్లాలోని 19 కేంద్రాల్లో ఇంటర్ ప్రథమ సంవత్సర వార్షిక పరీక్షలు బుధవారం ప్రశాంతంగా జరిగాయి. మొత్తం 4,935 మంది విద్యార్థులకు 4,573 మంది హాజరైనట్లు జిల్లా ఇంటర్మీడియట్ అధికారి సత్యనారాయణ పేర్కొన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, నలంద జూనియర్ కళాశాలలను అదనపు కలెక్టర్ డేవిడ్ తనిఖీ చేశారు. పరీక్ష కేంద్రాల వద్ద హాల్ టికెట్లను సరిచూసి విద్యార్థులను లోపలికి అనుమతించారు. అన్ని సెంటర్ల వద్ద మంచి తాగునీరు, వైద్య సిబ్బంది దగ్గర అందుబాటులో ఉంచారు.

ఆలస్యంగా వచ్చిన విద్యార్థులకు అనుమతి నిరాకరణ

ఇంటర్మీడియట్ పరీక్షలకు ప్రభుత్వం నిమిషం నిబంధనను విధించింది. దీంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులు ఉరుకులు పరుగులు తీశారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలకు కురవి మండల పరిధి అయ్యగారిపల్లి, ఉప్పరపల్లి, చిన్నగూడూరు మండలంలోని ఉగ్గంపల్లి గ్రామం నుంచి ముగ్గురు విద్యార్థులు ఆలస్యంగా వచ్చారు. వీరిని నిర్వాహకులు పరీక్ష కేంద్రంలోకి అనుమతించకపోవడంతో కంటతడి పెడుతూ వెనుదిరిగి వెళ్లారు.

సంత్ సేవాలాల్ ఆదర్శప్రాయుడు : మంత్రి

మాట్లాడుతున్న మంత్రి శ్రీనివాస్‌రెడ్డి

మరిపెడ, ఫిబ్రవరి 28: గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ సేవాలాల్ ఆదర్శప్రాయుడని రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. మరిపెడలోని మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం సేవాలాల్ జయంతిని పురస్కరించుకొని భోగ్ భండార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రభుత్వ విప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రామచంద్రూనాయక్‌తో కలిసి మంత్రి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేసి ప్రజారంజక పాలన అందిస్తుందన్నారు. గిరిజనుల అభ్యున్నతి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమన్నారు. కార్యక్రమంలో కేంద్ర మాజీ మంత్రి పోరిక బలరాంనాయక్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెండ్లి రఘువీరరెడ్డి, తాజుద్దీన్, అఫ్సర్ పాల్గొన్నారు.

వ్యాపారులకు రూములు కేటాయించాలి

మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రామ్మోహన్‌రెడ్డి

మహబూబాబాద్, ఫిబ్రవరి 28: కూరగాయల వ్యాపారులకు ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌లో రూములను కేటాయించాలని మున్సిపల్ చైర్మన్ పాల్వాయి రామ్మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ యాదవ్‌తో కలిసి మార్కెట్‌ను పరిశీలించారు. అనంతరం మున్సిపల్ కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డీఈ ఉపేందర్, మున్సిపల్ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ కిషోర్, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రాజేశ్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

వందశాతం ఫలితాలు సాధించాలి : డీఈవో


విద్యార్థులతో మాట్లాడుతున్న డీఈవో రామారావు

చిన్నగూడూరు, ఫిబ్రవరి 28: విద్యార్థులు కష్టపడి చదివి వార్షిక పరీక్షల్లో వందశాతం ఫలితాలు సాధించాలని జిల్లా విద్యాధికారి రామారావు సూచించారు. మండలంలోని జయ్యారం ఉన్నత పాఠశాలను బుధవారం ఆయన తనిఖీ చేశారు. ప్రత్యేక తరగతులపై ఆరా తీసి విద్యార్థుల సామర్థ్యాలను తెలుసుకున్నారు. విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు శాతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ ప్రతి విద్యార్థి స్వయం ప్రణాళిక, పాఠ్యాంశాల పునశ్చరణతో పాటు ఆత్మవిశ్వాసంతో చదివి మొదటి శ్రేణిలో ఫలితాలు సాధించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ఉపాధ్యాయులు ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. విద్యార్థి ఫెయిల్ అయితే సంబంధిత సబ్జెక్ట్ టీచర్‌దే బాధ్యత అన్నారు. హెచ్ఎం ఉషశ్రీ, ఉపాధ్యాయులు తేజోన్నతరెడ్డి, ఉపేందర్, రామ్మోహన్‌రెడ్డి, ఫిరోజ్, నవీన్, కిషన్, రహమున్నీసా, కే.శ్రీనివాస్, పీఈటీ ఆవారి శ్రీనివాస్ ఉన్నారు.

డీఎస్సీకి ముందు టెట్ నోటిఫికేషన్ వేయాలి

తొర్రూరు, ఫిబ్రవరి 28: డీఎస్సీకి ముందు ప్రభుత్వం టెట్ నోటిఫికేషన్ విడుదల చేయాలని రాష్ట్ర అంబేద్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు ధర్మారపు పవన్‌కుమార్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ సెంటర్‌లో ఖమ్మం–వరంగల్ జాతీయ రహదారిపై నిరుద్యోగ జేఏసీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతంలో టెట్ నిర్వహించి 6 నెలలు అయిందని, విద్యాశాఖ నిబంధనల ప్రకారం ఏడాదికి 2 సార్లు టెట్ నిర్వహించాలన్నారు. జేఏపీ ఉపాధ్యక్షుడు పంతం సురేందర్, టెట్ అభ్యర్థులు గణిత, సౌజన్య, రమ్య, స్వరూప, అశ్విని, అనిత, అనిల్, లక్ష్మీప్రసన్న, రిబ్కా, నీరజ, ఫర్జాన, నవాజ్, యాకయ్య పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న టెట్ అభ్యర్థులు, అంబేద్కర్ సంఘం నాయకులు

'ఆయిల్‌పామ్' సాగుపై దృష్టి సారించాలి

తొర్రూరు, ఫిబ్రవరి 28: ఆయిల్‌పామ్ సాగుపై రైతులు దృష్టి సారించాలని ఆయిల్‌ఫెడ్ జిల్లా ఇన్‌చార్జి సీహెచ్ రాములు అన్నారు. బుధవారం మండలంలోని హరిపిరాలలో రావుల రాఘవేందర్‌రెడ్డి ఆయిల్‌పామ్ తోటలో పంట సాగు, మెళకువలపై ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. జిల్లాలో ఆయిల్‌పామ్ విస్తరణకు చర్యలు తీసుకుంటున్నామని, ఈ పంటలకు ఎలాంటి నష్టం ఉండదన్నారు. తొర్రూరు శివారు గోపాలగిరి గ్రామంలో పరిశ్రమ ఏర్పాటు పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఫ్యాక్టరీ వరకు పంట రవాణా ఖర్చులను పూర్తిగా టీఎస్ ఆయిల్‌ఫెడ్ భరిస్తుందని, అధిక లాభాలు ఇచ్చే ఆయిల్‌పామ్ సాగుపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో ఆయిల్‌ఫెడ్ జిల్లా కోఆర్డినేటర్ రంజిత్, రైతులు రావుల నరసింహారెడ్డి, జగదీశ్ చందర్‌రెడ్డి, కడుదుల రాజేశ్, నర్సమ్మ, ఐలయ్య పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య

బయ్యారం ఫిబ్రవరి 28: బావిలో దూకి వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో జరిగింది. గంధంపల్లి గ్రామానికి చెందిన కేసగాని అప్పయ్య పెద్ద కూతురు శైలజ (28)కు అనంతారానికి చెందిన ఓ వ్యక్తితో వివాహమైంది. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చిన శైలజ బుధవారం సమీపంలోని బావిలో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. స్థానికులు గమనించి మృతదేహాన్ని వెలికి తీశారు.

బైక్ అదుపుతప్పి ఒకరి మృతి

గూడూరు, ఫిబ్రవరి28: ద్విచక్ర వాహనం అదుపు తప్పడంతో ఒకరు మృతి చెందిన ఘటన మండలంలోని బొల్లేపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్సై సీహెచ్ నగేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ పరిధి సోమ్లాతండాకు చెందిన బానోత్ గణపతి(40), పక్కనే ఉన్న బంచరాయి తండాకు చెందిన బానోత్ నరేశ్, బానోత్ రమేశ్ గూడూరులోని మెడికల్ షాపునకు బైక్‌పై బయలుదేరారు. ఈ క్రమంలో చిన్నవడ్డెరగూడెం వద్ద బైక్ అదుపుతప్పి ముగ్గురు కిందపడి పోయారు. ఈ ఘటనలో గణపతికి తీవ్ర గాయాలై మృతి చెందాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

కురవి, ఫిబ్రవరి 28: రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి చెందిన ఘటన మండలంలోని అయ్యగారిపల్లిలో బుధవారం జరిగింది. మరిపెడ మండలం ఆనేపురం శివారు వెంకట్యాతండాకు చెందిన గుగులోత్ అఖిల్(22), అశోక్ బైక్‌పై మహబూబాబాద్‌కు వెళ్తున్నారు. అయ్యగారిపల్లి సమీపంలోకి రాగానే రోడ్డు పక్కన రెయిలింగ్‌కు బైక్ ఢీకొనగా అఖిల్ మెడకు తీవ్రగాయమై అక్కడికక్కడే మృతి చెందాడు. వెనక కూర్చున్న అశోక్‌కు గాయాలు కాగా మానుకోట ఏరియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు కురవి ఎస్సై గోపి తెలిపారు.

అవరోహణ క్రమంలో పోస్టులు భర్తీ చేయాలి

దంతాలపల్లి, ఫిబ్రవరి 28: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గురుకుల ఉపాధ్యాయ పోస్టులను అవరోహణ క్రమంలో భర్తీ చేయాలని నిరుద్యోగ విద్యార్థి జేఏసీ రాష్ట్ర నాయకుడు పంతం విజయేందర్ డిమాండ్ చేశారు. బుధవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ గురుకుల ఉపాధ్యాయ పోస్టుల కోసం కష్టపడి చదివి ప్రవేశ పరీక్షలు రాసిన నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని బ్యాక్‌లాగ్ పోస్టులు లేకుండా అవరోహణ క్రమంలో భర్తీ చేయాలన్నారు. సురేందర్, కృష్ణ, శ్రీను పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతిపత్రం

పెద్దవంగర, ఫిబ్రవరి 28: మండలంలో పెండింగ్‌లో ఉన్న పనులు పూర్తయ్యేలా నిధులు మంజూరు చేయాలని పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినీరెడ్డికి బొమ్మకల్లు ఎంపీటీసీ బానోత్ రవీందర్‌నాయక్ వినతిపత్రాన్ని అందజేశారు. ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

ఉపాధి హామీపై ప్రజావేదిక

కేసముద్రం, ఫిబ్రవరి 28: మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పథకంపై ప్రజా వేదిక నిర్వహించారు. ఎస్టీ కాలనీ, నారాయణపురం, పీక్లాతండా, క్యాంపు తండా, గాంధీపురం, సర్వాపురం, తాళ్లపూసపల్లి, కేసముద్రం స్టేషన్ గ్రామాల్లో జరిగిన పనులపై ప్రజా వేదిక నిర్వహించారు. ఎంపీపీ ఓలం చంద్రమోహన్, జడ్పీటీసీ రావుల శ్రీనాథ్‌రెడ్డి, అడిషనల్ పీడీ శాంతాదేవి ఉన్నారు.

పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తున్న బీజేపీ

నర్సింహులపేట, ఫిబ్రవరి 28: రైతాంగంపై ఉక్కుపాదం మోపుతూ, పెట్టుబడిదారులకు కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కొమ్ము కాస్తున్నదని సీపీఐఎంఎల్ ప్రజా పంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో సీపీఐ(ఎంఎల్) మాస్ లైన్ విలీన మహాసభల వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. మార్చి 3 నుంచి 5 వరకు ఖమ్మం జిల్లా కేంద్రంలో విలీన జాతీయ మహాసభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అనిల్, వెంకటయ్య, నరసింహ, కృష్ణమూర్తి పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : టీపీటీఎఫ్

పెద్దవంగర, ఫిబ్రవరి 28: రైతులు పండించిన పంటలకు కనీస మద్దతు ధర ఇవ్వాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలదేనని టీపీటీఎఫ్ జిల్లా నాయకుడు సోమారపు ఐలయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడు చిక్కాల సతీశ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హామీలను అమలు చేయాలని రైతులు ఉద్యమం చేస్తుంటే వారిపై బాష్పవాయువు, రబ్బరు బుల్లెట్లు ప్రయోగించి గాయాలపాలు చేయడం, అక్రమ కేసులు పెట్టి భయపెట్టడం సిగ్గుచేటన్నారు. ఉపాధ్యాయ సంఘ నాయకులు వెంకన్న, దేవేందర్, సురేశ్, మురళి, ప్రతాప్‌రెడ్డి, నరేశ్ పాల్గొన్నారు.

ఉపాధి హామీలో పనిదినాలు పెంచాలి

డోర్నకల్, ఫిబ్రవరి 28: ఉపాధి హామీ పథకంలో 200 రోజులకు పనిదినాలను పెంచాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఉప్పలపల్లి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. బుధవారం గొల్లచర్లలో సభ్యత్వ నమోదు కార్యక్రమం నిర్వహించి మాట్లాడారు. ఉపాధి పనులకు రోజుకు రూ. 600 ఇవ్వాలని, పనుల వద్ద సౌకర్యాలు కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో మండల నాయకులు వెంకట్రాములు, అరుణ, నిర్మల, సీతమ్మ, సుశీల పాల్గొన్నారు.

ఘనంగా తిరుగువారం పండుగ

గూడూరు, ఫిబ్రవరి28: చింతలగట్టు వట్టివాగు జాతరలో బుధవారం తిరుగువారం పండుగను ఘనంగా నిర్వహించారు. అమ్మవార్లు గద్దెలకు చేరుకుని తిరిగి వనం చేరిన మొదటి బుధవారం ఈ పండుగను నిర్వహిస్తారు. ఈ సందర్భంగా సమ్మక్క, సారలమ్మ పూజా మందిరంలో పూజా సామగ్రిని, గద్దెలను శుద్ధి చేశారు. అనంతరం అమ్మవార్లకు బోనాలు సమర్పించారు. దీంతో జాతర ఈ సంవత్సరం ముగిసినట్లు పూజారులు ప్రకటించారు.

7 నుంచి బ్రహ్మోత్సవాలు

కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఎస్సై సతీశ్

నర్సింహులపేట, ఫిబ్రవరి28: మండల కేంద్రంలోని రాజరాజేశ్వర నవగ్రహ ప్రసన్నాంజ నేయ స్వామి దేవస్థానంలో మార్చి 7 నుంచి 9 వరకు బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నట్లు ప్రధాన అర్చకుడు దేవేంద్ర శర్మ తెలిపారు. ఈ మేరకు బుధవారం శివాలయంలో బ్రహ్మోత్సవాల కరపత్రికను ఎస్సై గండ్రాతి సతీశ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రధాన అర్చకుడు మాట్లాడుతూ మార్చి 7న గణపతి పూజ, పుణ్యాహవచనం, రుత్విక్ కలశస్థాపన, నవగ్రహారాధన, ఆవాహనదేవతాపూజ, పాలికాపూజ, నైవేద్యంచ హారతీచ ప్రసాద వితరణ ఉంటుందన్నారు. 8న రుద్రాభిషేకం, చండీ హోమం, పూర్ణాహుతి, అష్టోత్తర కలశాభిషేకం, రాత్రి 8 గంటలకు శివపార్వతుల కల్యాణం, 12 గంటలకు లింగోద్భవకాల అష్టోత్తర శతకలశాభిషేకం, 9న మహారుద్రాభిషేకం, మంత్రపుష్పం నిర్వహించనున్నట్లు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. వేంకటేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ బొల్లం రమేశ్, నరసింహారెడ్డి, కనకం, వెంకన్న ఉన్నారు.

పట్టపగలే ఇంట్లో చోరీ..

రూ.1.63లక్షలు అపహరణ

నర్సింహులపేట, ఫిబ్రవరి 28: పట్టపగలే ఇంట్లో దొంగలు పడి నగదు దోచుకుపోయిన ఘటన మండలంలోని కొమ్ములవంచ గ్రామంలో బుధవారం చోటుచేసుకుంది. నర్సింహులపేటలో బంధువుల పెళ్లికి కొత్తపల్లి సైదులు కుటుంబసభ్యులతో కలిసి ఇంటికి తాళం వేసి వెళ్లాడు. తిరిగి వచ్చి చూసేసరికి దొంగలు ఇంటి తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న నగదు రూ. 1,60,000తోపాటు బ్యాగులో ఉన్న రూ.3000 అపహరించుకుపోయారు. విషయం తెలుసుకున్న తొర్రూరు సీఐ సంజీవ్, ఎస్సై సతీశ్ ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

బయ్యారం కాంగ్రెస్‌లో లుకలుకలు

- జిల్లా అధ్యక్షుడి తీరుపై ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు
- బహిష్కృత జిల్లా ప్రధాన కార్యదర్శిని పార్టీలో చేర్చుకున్న కోరం కనకయ్య
- నాయకులను బహిష్కరించే హక్కు జిల్లా అధ్యక్షుడికి లేదని స్పష్టం

బహిష్కృత నేత ప్రవీణ్‌ను పార్టీలో చేర్చుకుంటున్న ఇల్లెందు ఎమ్మెల్యే కనకయ్య

బయ్యారం, ఫిబ్రవరి 28 : మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండలంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో నేతల మధ్య లుకలుకలు బయటపడ్డాయి. పార్టీ జిల్లా అధ్యక్షుడు భరత్ చంద్రారెడ్డి నిర్ణయాన్ని తప్పుబడుతూ ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య చేసిన ఘాటు వ్యాఖ్యలు స్థానికంగా చర్చనీయాంశమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. ఇటీవల జిల్లా కార్యదర్శి భూక్య ప్రవీణ్‌నాయక్‌ను జిల్లా అధ్యక్షుడు బహిష్కరించగా, బుధవారం కొత్తపేటలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఎమ్మెల్యే కనకయ్య పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇల్లెందు నియోజకవర్గంలో పార్టీ గెలుపు కోసం కృషిచేసిన భూక్య ప్రవీణ్ నాయక్‌కు జిల్లా ప్రధాన కార్యదర్శి పదవి ఇచ్చింది జిల్లా అధ్యక్షుడేనని కానీ తొలగించినట్లుగా వార్తలు వచ్చాయన్నారు. కాంగ్రెస్ పార్టీలో పదవులు ఇవ్వడమే తప్ప తొలగించే హక్కు జిల్లా అధ్యక్షుడికి లేదని పార్టీ క్రమశిక్షణ సంఘానికే ఆ అధికారాలు ఉంటాయని స్పష్టంచేశారు. పదవులు ఇచ్చేటప్పుడు కానీ, తొలగించేటప్పుడు కానీ తనతో చర్చించలేదన్నారు. తొలగించేందుకు తాను ఒప్పుకోనని, బహిష్కరించిన ప్రతి ఒక్కరిని చేర్చుకుంటామని చెప్పారు. రానున్న ఎన్నికల దృష్ట్యా పార్టీని పెంచే ఆలోచన చేయాలే కానీ తుంచే ఆలోచన చేయొద్దని భరత్ చంద్రారెడ్డితీరుపై ఎమ్మెల్యే ఘాటు వ్యాఖ్యలు చేశారు. బహిష్కరణ విషయంపై అవసరమైతే జిల్లా అధ్యక్షుడితో ప్రత్యేకంగా మాట్లాడుతానని ఎమ్మెల్యే చెప్పారు. అయితే ఒకరి నిర్ణయాన్ని మరొకరు ఎత్తిచూపుతూ వ్యాఖ్యలు చేయడంపై స్థానికంగా దుమారం రేపింది.

నకిలీ మందుతో ఎండిపోయిన వరి

ఎండిపోయిన సత్తయ్య వరి పొలం

నర్సింహులపేట, ఫిబ్రవరి 28: చిరుపొట్టదశలో ఉన్న వరికి మందు పిచికారీ చేయడంతో ఎండిపో యిన ఘటన మండలంలోని నర్సింహాపురం బంజర గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు నిమ్మరబో యిన సత్తయ్య తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 23న మరిపెడలో ఓ పెస్టిసైడ్ దుకాణం యజమానికి చిరు పొట్టదశలో వరికి పురుగు ఉందని చెప్పడంతో సూపర్ స్టార్‌తోపాటు ఐజింకి అనే మందు ఇవ్వ డంతో రెండు ఎకరాల పొలానికి ఈ నెల 27న పిచికారీ చేశా. బుధవారం ఉదయం చూసే సరికి ఎండిపోయి ఉంది. వ్యవసాయ అధికారికి ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అందుబాటులో లేరు. అ విష యంపై ఇన్‌చార్జీ ఏవో రామకృష్ణ మాట్లాడుతూ గురువారం పరిశీలించి రైతుకు న్యాయం చేస్తామన్నారు.

పల్స్‌పోలియోను విజయవంతం చేయాలి

రికార్డులను పరిశీలిస్తున్న జిల్లా వైద్యాధికారి అంబలీష్

కురవి, ఫిబ్రవరి 28: మార్చి 3వ తేదీన జరిగే పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఏ అంబరీష్ కోరారు. బుధవారం బలపాల పీహెచ్‌సీ, గుండ్రాతి మడుగు సబ్ సెంటర్‌ను ఆయన సందర్శించి మాట్లాడారు. ఐదేళ్లలోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయించాలన్నారు. అదేవిధంగా 12 వారాలలోపు గర్భిణుల పేర్లు నమోదు చేయాలని, సాధారణ ప్రసవాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ స్రవంతి, సీహెచ్‌వో కృష్ణార్జునరావు, సబ్ యూనిట్ ఆఫీసర్ వడ్డబోయిన శ్రీనివాస్, చందు, ఆరోగ్య, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

సౌర విద్యుత్‌తో కాలుష్యాన్ని తగ్గించొచ్చు

మహబూబాబాద్ రూ